

జనగామ పట్టణంలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు

# ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలు

- అక్కడక్కడ చెదురుమదురు ఘటనలు..
- ఓటమి తప్పదని కవ్వింపు చర్యలకు పాల్పడిన కాంగ్రెస్
- పల్లాను అడ్డుకున్న హస్తం నాయకులు

జనగామ రూరల్, నవంబర్ 30 : గత నెల రోజుల నుంచి జరుగుతున్న ఎన్నికల ప్రచారం ఈ నెల 28న ముగిసింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం 5 వరకు ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. సమయం దాటిపోయిన తరువాత కూడా ఓటర్లు పోలింగ్‌స్టేషన్‌లలో బారులు తీరారు. వారికి కూడా ఓటు వేయడానికి అధికారులు సమయం కేటాయించారు. ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. వృద్ధులకు వీల్‌చైర్లు ఏర్పాటు చేసి ఓటు వేయించారు.

**కదిలిన యువత..**

ఈ ఎన్నికల్లో యువతీయువకులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపించారు. కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. పని చేసే నాయకుడినే ఎన్నుకుంటామని ఉత్సాహంగా తెలిపారు.



జనగామ రూరల్ : పెంబర్తిలో ఓటువేయడానికి క్యూలైన్లో వేచియున్న ఓటర్లు

**పల్లాను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు**

పోలింగ్ స్టేషన్ల పరిశీలనకు వచ్చిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కొందరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఓటమి భయంతో కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. మండలంలోని శామీర్‌పేట, పెద్దరాంచర్ల గ్రామాల్లో ఎన్నికల సరళిని పరిశీలించడానికి వచ్చిన ఆయనను కొందరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ప్రతిగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు జై పల్లా, జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు కలుగజేసుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. పెద్దరాంచర్ల గ్రామంలో గంట పాటు ఈవీఎం సతాయించడంతో మరో ఈవీఎం ఏర్పాటు చేసి ఓటింగ్ ప్రారంభించారు. పసరమడ్లలో సర్పంచ్ భర్త పోలింగ్ ఏజెంట్ ఉన్నాడని కాంగ్రెస్ నాయకులు పోలింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అతన్ని పోలింగ్ కేంద్రం నుండి పంపించారు. సిద్దెంకిలో ఇరుపార్టీల వారు గొడవ పడటంతో బీఆర్‌ఎస్ కార్యకర్తను పోలీసులు కొట్టడంతో నిరసన తెలిపారు. ఇలాంటి చెదురుమదురు ఘటనలు మినహా మండలంలో ఎన్నికలు ప్రశాంతగా జరిగాయి. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా ఎన్నికల అధికారి శివలింగయ్య**

జనగామ చౌరస్తా : శాసన సభ ఎన్నికల నేపథ్యంలో భాగంగా గురువారం జనగామ పట్టణ కేంద్రంలోని ప్రెస్టన్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నెంబర్ 273లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చెట్టిపల్లి శివలింగయ్య, వందన దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి శివలింగయ్య మాట్లాడుతూ జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ సజావుగా కొనసాగినట్లు తెలిపారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## పోలింగ్ సరళిని పరిశీలించిన బీఆర్‌ఎస్ అభ్యర్థి 'పల్లా'

జనగామ చౌరస్తా : జనగామ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ పోలింగ్ బూత్ నంబర్ 267, 268, 269, 270లతోపాటు పలు పోలింగ్ కేం ద్రాల్లో గురువారం జరిగిన పోలిం గ్ సరళిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లతో ఆ ప్యాయంగా ముచ్చటించారు. అ నంతరం పల్లా మాట్లాడుతూ ప్రజ ల ఆశీర్వాదంతో భారీ మెజార్టీ సాధించి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

## పోలింగ్ సరళిని పరిశీలించిన 'పల్లా'

బచ్చన్నపేట, నవంబర్ 30 : మండల కేంద్రంతోపాటు పోచన్నపేట, ఆలింపూర్‌లో పోలింగ్ కేంద్రాలను బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఓటర్లతో మాట్లాడారు. మండలంలోని ప్రశాంత ఎన్నికలకు సహకారం అందించిన కార్యకర్తలకు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జనగామలో గులాబీ జెండా ఎగురడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, బచ్చన్నపేట సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, నాయకులు వడ్డేపల్లి ఉపేందర్‌రెడ్డి, కొండి వెంకట్‌రెడ్డి, జావీద్, షబ్బీర్, సిద్దులు, వినోద్ పాల్గొన్నారు.

**బచ్చన్నపేటలో ఓటు వేసిన బోడకుంటి**

బచ్చన్నపేట మండల వ్యాప్తంగా యువత మొదటిసారిగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఆలింపూర్‌లో పర్వతం అజయ్, బచ్చన్నపేటలో ప్రణయ్‌రెడ్డితోపాటు మరికొందరు తమ ఓటు హక్కును మొదటిసారిగా వినియోగించుకుని సంతోషం వ్యక్తం చేశారు. పడమటికేశ్వాపూర్‌లో ఎన్నికల సిబ్బంది 4నంబర్ చూపించమంటే 3వ నంబర్ చూపించారని ఓ వృద్ధుడు ఆరోపించారు. కట్కూర్‌లో కరెంటు పో యి కొంత సేపు, కొన్నెలో కాసేపు ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. బచ్చన్నపేటలో గురువారం మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణ, ఎస్సై సతీశ్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

## నర్మెటలో ప్రశాంతంగా పోలింగ్..

నర్మెట : మండలంలోని అన్ని గ్రామాల్లో శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 19,825 ఓట్లు ఉండగా 22 బూత్‌లు ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక బందోబస్తును పోలీసులు, ఎన్నికల అధికారులు నిర్వహించారు. వరంగల్ మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు గద్దల పద్మ వారి కుటుంబంతో కలిసి స్వగ్రామంలోని గండిరామవరంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## జనగామలో పల్లా గెలుపు ఖాయం

- దేశానికి కేసీఆర్ సేవలు అవసరం
- ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి
- ఎల్లంల గ్రామంలో ఓటుహక్కును వినియోగించుకున్న ముత్తిరెడ్డి దంపతులు

జనగామ రూరల్, నవంబర్ 30 : సీఎం కేసీఆర్ సేవలు దేశానికి అవసరమని ప్రజలు తీర్పు ఇవ్వబోతున్నారని ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎల్లంల గ్రామంలో తన సతీమణి పద్మాలతారెడ్డితో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి సీఎంగా కేసీఆర్, జనగామలో పల్లా విజయం సాధిస్తారన్నారు. తెలంగాణ అభివృద్ధిని చూసిన వివిధ రాష్ట్రాల ప్రజలు, ప్రజాప్రతినిధులు సీఎం కేసీఆర్ సేవలు దేశానికి అవసరమని గుర్తించారని, ఎర్రకోటపై జెండా పాతుతామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభంజనాన్ని ఎవరికీ ఆపడం తరం కాదన్నారు. అక్కడక్కడ కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ నాయకులు అలజడులు సృష్టిస్తున్నారని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా గెలిచేది బీఆర్‌ఎస్, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా అని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర సుజాత, ఎంపీటీసీ బండ లక్ష్మీవెంకటేశం, నాయకులు ప్రవీణ్, సతీశ్, రమేశ్ పాల్గొన్నారు.



జనగామ పట్టణంలోని పోలింగ్ కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు



జనగామ పట్టణంలోని అంబేద్కర్‌నగర్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ రూరల్ : పెంబర్తిలో ఓటువేసిన మహిళలు



జనగామ రూరల్ : శామీర్‌పేటలో బారులుతీరిన ఓటర్లు



నర్మెట పోలింగ్ కేంద్రంలో బారులుతీరిన ఓటర్లు



నర్మెట : గండిరామవరంలో ఓటు హక్కును వినియోగించుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గద్దల పద్మ, నర్సింగరావు



నర్మెట : మచ్చుపహాడ్‌లో బారులుతీరిన ఓటర్లు



జనగామ పట్టణంలోఓటు వేయడానికి వస్తున్న వృద్ధులు



జనగామ పట్టణంలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు